సాక్షి కర్నూలు

శనివారం । 13 । జనవరి । 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



ఖాదర్‌లింగ స్వామి వేడుకలు

ఖాదర్‌లింగ స్వామి జయంతి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేడుకలకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 8లో▸



జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 8లో▸

న్యూస్‌రీల్

672 సచివాలయాల్లో 'జన భగీదరి'



కర్నూలులోని వార్డు సచివాలయంలో ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా శుక్రవారం జిల్లాలోని 672 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో సామాజిక సమతా సంకల్పం (జన భగీదరి) పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన నేతృత్వంలో అర్బన్ పరిధిలో 211, గ్రామీణ ప్రాంతాల్లో 461 సచివాలయాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించారు. సామాజిక సమతా సంకల్పంలో దాదాపు 6,181 మంది పౌరులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన బ్యానర్‌పై 28,063 మంది సంతకాలు చేశారు. జిల్లా స్థాయిలో ఈ నెల 18న అనేక కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

నేడు కర్నూలుకు ఏపీఈఆర్‌సీ చైర్మన్ రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి శనివారం కర్నూలుకు రానున్నారు. ఏపీఈఆర్‌సీ రాష్ట్ర స్థాయి కార్యాలయం ఏర్పాటు అవుతోంది. కర్నూలులో డోన్ రోడ్డులోని కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంతంలో సొంత భవనాన్ని కూడా నిర్మిస్తున్నారు. భవన నిర్మాణపు పనులను జస్టిస్ నాగార్జునరెడ్డి పరిశీలిస్తారని కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు.

హంద్రీ నదికి జీడీపీ నీరు

కోడుమూరు రూరల్: మంచినీటి సమస్య పరిష్కారానికి హంద్రీ నదికి గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నీటిని వదిలారు. కోడుమూరు, వర్కూరు, గోరంట్ల గ్రామాల్లో నీటి సమస్య ఉందని, హంద్రీనదికి నీటిని విడుదల చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు జిల్లా అధికారులను కోరారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు శుక్రవారం జీడీపీ ఎడమ కాల్వ ద్వారా 80 క్యూసెక్కుల నీటిని వర్కూరు సుద్దవాగు మీదుగా హంద్రీనదిలోకి విడుదల చేశారు. నీటి విడుదలను కోడుమూరు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్, పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్‌లు పరిశీలించారు.



ఐదేళ్లు.. అమ్మలా రక్షణ!



అధునాతన ఇంక్యుబేటర్లలో చికిత్స పొందుతున్న శిశువులు

☛ గడివేములకు చెందిన విశ్వతేజనికి ఇటీవల ముగ్గురు కవలలు జన్మించారు. 30 వారాలకే జన్మించడం, బరువు తక్కువగా ఉండటంతో పాటు పలు అనారోగ్య సమస్యలు ఉండటంతో వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్‌ఐసీయూలో చేర్చారు. నెలరోజుల పాటు వారిని వైద్యులు కంటికి రెప్పలా కాపాడి ఆరోగ్యంతో పాటు బరువునూ పెంచి డిశ్చార్జ్ చేశారు.

☛ కర్నూలు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మీనాకుమారికి ఇటీవల ఆమె 31 వారాలకే బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో శిశువు పెద్దాసుపత్రిలోని ఎన్‌ఐసీయూలో చేర్చారు. బిడ్డ కేవలం 1.3కిలోల బరువు మాత్రమే ఉండటమే గాక ఇన్‌ఫెక్షన్, మెనింజైటిస్ వంటి సమస్యలు ఉండటంతో వెంటిలేటర్‌పై 25 రోజుల పాటు ఉంచి చికిత్స చేశారు. వైద్యుల కృషి ఫలించి ఆ బిడ్డ ప్రాణం పోసుకుని హాయిగా తల్లి ఒడిలో ఇంటికి చేరింది.

.. వీరిద్దరే కాదు ఇలాంటి వారు ప్రతిరోజూ పదుల సంఖ్యలో చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్తున్నారు. ప్రైవేటుగా ఎన్ని పెద్ద ఆసుపత్రులు వచ్చినా రోగులు మాత్రం ఈ ఆసుపత్రిపై ఉన్న నమ్మకంతో నేరుగా తమ పిల్లలను ఇక్కడికే తీసుకొచ్చి వైద్యం చేయిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా వైద్యులు మెరుగైన చికిత్స అందించి పంపిస్తున్నారు. వైద్యుల కృషిని గుర్తించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు మెరుగుపరుస్తోంది.

- కర్నూలు పెద్దాసుపత్రిలో శిశువులకు మెరుగైన వైద్యం
- ప్రైవేటును కాదని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరుతున్న రోగులు
- రోజూ 200లకు పైగా ఓపీ సేవలు
- ప్రభుత్వ చొరవతో పెరిగిన వైద్యుల సంఖ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యాలలోని చిన్నపిల్లల విభాగంలో 120 పడకలున్నాయి. దీంతోపాటు 25 పడకలతో పీఐసీయూ ఏర్పాటైంది. ప్రతిరోజూ 200 నుంచి 250 మంది దాకా ఓపీ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇన్‌పేషంట్లుగా రోజూ 25 నుంచి 30 మంది చేరుతుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు అసోసియేట్, మూడు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అయ్యాయి. దీంతో ప్రస్తుతం ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 8 మంది ప్రొఫెసర్లు ఉన్నారు. వీరితో పాటు 15 మంది పీజీలు విద్యనభ్యసిస్తూ సేవలందిస్తున్నారు. ఇందులో ఇటీవల నాలుగు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఇటీవల ఈ విభాగానికి ఒక్కోటి 20 పడకలతో రెండు ఎస్‌ఎన్‌సీయూలు, ఒక ఎన్‌ఐసీయూ విభాగాలు మంజూరయ్యాయి. ఇందులో వైద్యపరికరాలు, వసతుల కోసం ఒక్కోదానికి రూ.35లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆయా విభాగాల ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. కాగా కోవిడ్ సమయంలోనూ చిన్న పిల్లల విభాగంలో మెరుగైన సేవలు అందించారు.

పరిశోధనలు, ప్రచురణలు

ఇక్కడి వైద్యుల ఆధ్వర్యంలో ప్రతి పీజీ విద్యార్థి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆమోదించిన అంశాలపై పరిశోధన చేస్తున్నారు. వైద్యులు స్వతహాగా చేసే పరిశోధనలు వీటికి అదనం. పరిశోధనాంశాలు తరచూ పలు రకాల జర్నల్స్‌లో ప్రచురితమవుతూ ఉంటాయి.



నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఎస్‌ఎన్‌సీయూ విభాగం

చిన్నపిల్లల విభాగంలో అందే సేవలు

ఈ విభాగంలో చిన్నపిల్లల్లో వచ్చే మెనింజైటిస్, ఎన్‌సెఫలైటిస్(మెదడువాపు), మూర్ఛ, నిమోనియా, డయారియా, చిన్నపిల్లల్లో వచ్చే గుండెజబ్బులు, కిడ్నీ జబ్బులు, టీబీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్లు, తలసీమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా వ్యాధులతో పాటు సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు, జ్వరం, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలకు చికిత్స అందిస్తారు.



పెద్దాసుపత్రిలో చిన్నపిల్లల విభాగం భవనం

రూ.లక్షకు పైగా ఖరీదైన ఇంజెక్షన్లు ఇచ్చారు



నా కుమారుడు చరణ్‌కు 2017లో నరాల జబ్బు(గులియన్ బ్యారి సింగ్రోమ్) వచ్చింది. అప్పట్లో ఇదే ఆసుపత్రిలో నెలరోజులపాటు చికిత్స చేసి బాగు చేసి పంపించారు. మళ్లీ ఇప్పుడు సమస్య రావడంతో ఆరు రోజుల క్రితం చేరాం. వైద్యులు ప్రతిరోజూ ఒక్కో ఇంజెక్షన్ రూ.20వేల ఖర్చుది రోజూ రెండు చొప్పున ఆరు రోజుల పాటు ఇచ్చారు. ఇంత ఖరీదైన వైద్యాన్ని ప్రైవేటుగా అయితే చేయించుకోవడానికి మాకు సాధ్యమయ్యేది కాదు. ఇంతటి సేవలందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పి. శ్రీనివాసులు, జొహరాపురం, కర్నూలు

బాబు ఒక్కరోజులోనే కోలుకున్నాడు



మాది రుద్రవరం మండలం నర్సాపురం గ్రామం. మా బాబు లక్కీ లోకేష్‌కు రెండు రోజుల క్రితం కడుపు నొప్పి వచ్చింది. ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించాం. అక్కడ బాగు కాకపోవడంతో నేరుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చాం. ఇక్కడి వైద్యులు పరీక్ష చేసి బాబు ఊపిరితిత్తుల్లో చీము ఉన్నట్లు గుర్తించి దానిని తీసివేయడానికి పైపు ఏర్పాటు చేశారు. దీనివల్ల ఒక్కరోజులోనే బాబు కోలుకున్నాడు.

–లక్కీ లోకేష్ తల్లిదండ్రులు కృష్ణ, సుమిత్ర

ఖాళీలన్నీ భర్తీ అయ్యాయి



గతంలో చిన్నపిల్లల విభాగంలో వైద్యుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి చిన్నపిల్లల విభాగంలో ఖాళీలన్నీ భర్తీ చేసింది. దీంతో పాటు పీజీ సీట్లు పెరగడంతో వైద్యుల సంఖ్య పెరిగింది. అంతేగాక స్టాఫ్‌నర్సుల సంఖ్య సైతం పెరిగింది. అన్ని విభాగాల్లో తగినంత మంది వైద్యులు, సిబ్బంది ఉండటం వల్ల మెరుగైన వైద్యసేవలు అందుతుండటంతో మరణాల శాతం కూడా తగ్గింది.

–డాక్టర్ విజయానందబాబు, చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

ఐదేళ్లలో చిన్నపిల్లల విభాగంలో అందిన సేవలు

సంవత్సరం	ఓపీ సేవలు	ఐపీ సేవలు
2019	26,565	9,960
2020	10,102	5,212
2021	25,342	8,246
2022	24,450	6,257
2023	26,916	8,680

ఎన్‌ఆర్‌సీలో సేవలు

న్యూట్రీషియన్ రిహాబిలేటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)లో బరువు తక్కువగా ఉన్న పిల్లలను రెండు వారాల పాటు ఉంచి తగినంత బరువు పెరిగిన తర్వాత తగిన సలహాలు, సూచనలతో ఇంటికి(డిశ్చార్జ్) పంపిస్తారు. ఐదేళ్లుగా ఇక్కడ అందిస్తున్న వైద్యసేవల వివరాలు.

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య
2019	258
2020	85
2021	207
2022	283
2023	325

ఎస్‌ఎన్‌సీయూ/ఎన్‌ఐసీయూ (పురిటిపిల్లల విభాగం)

20 పడకలతో నడుస్తున్న ఎన్‌ఐసీయు విభాగాన్ని ప్రస్తుతం 60 పడకలకు పెంచారు. ఇందుకు సంబంధించి ఆక్సిజన్, ఏసీల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పరికరాల సరఫరా ముగిసింది. త్వరలో ఇది ప్రారంభం కాబోతోంది. పాత విభాగంలో ఐదేళ్లలో అందించిన వైద్యసేవల వివరాలు.

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య
2019	3,033
2020	3,092
2021	2,822
2022	3,138
2023	3,213

అవయవలోపం ఉన్న వారికి డైస్

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలకు సంబంధించి ఎదుగుదల లోపం, మూర్ఛ వ్యాధి, తలసీమియా, హిమోఫీలియా, వంటి వ్యాధులకు చికిత్సలతో పాటు గ్రహణమొర్రి, గుండెజబ్బులు లాంటి వాటికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో ఐదేళ్లుగా అందించిన సేవలు

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య
2019	11,853
2020	11,202
2021	16,792
2022	10,868
2023	9,143

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- శ్రీగిరిలో పంచాహ్నికదీక్షతో శాస్త్రోక్తంగా ఉత్సవాలు ప్రారంభం



చండీశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈవో దంపతులు



ఆలయ ధ్వజస్తంభంపై ధ్వజపటం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి మల్లికార్జునస్వామికి ఏటా మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8.30గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమ శాస్త్రానుసారంగా జరిపించారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఆలయ అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు చతుర్వేదపారాయణలతో వేదస్వస్తి నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. గణపతిపూజ, వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం బ్రహ్మోత్సవ నిర్వహణకు ఆధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపారు. చండీశ్వర అర్చన తరువాత కంకణాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆలయ ఈవో, అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలు ధరించారు. అనంతరం రుత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువచ్చి, ఆ మట్టిని 9 పాలికలలో (మూకుళ్లలో) నింపి దాంట్లో నవధాన్యాలు పోసి పూజలు నిర్వహించారు.

సకల దేవతలను ఆహ్వానిస్తూ.. ధ్వజారోహణ

ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేయడమే ధ్వజారోహణ. ఈ కార్యక్రమంలో ఒక కొత్తవస్త్రంపై పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళచిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే నందిధ్వజపటం అంటారు. ఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి చండీశ్వరస్వామి సమక్షంలో పూజలు నిర్వహించారు. అలాగే భేరీపూజలో డోలు వాద్యానికి పూజలు చేశారు. అనంతరం నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ముక్కోటిదేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకుగాను ఈ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

నేడు భృంగివాహనసేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహిస్తారు. భృంగివాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి ప్రత్యేక పూజల అనంతరం పురవీధుల్లో ఘనంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు.

డీసీసీబీ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17వ తేదీ వరకు పదవీ కాలం ఉండగా.. దానిని జూలై 17వ తేదీ వరకు పొడిగిస్తూ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి జీవో ఆర్‌టీ నంబరు 28 జారీ చేశారు. నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎస్వీ విజయ మనోహరి, సభ్యులుగా గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, వెంకటరమణారెడ్డి, మాలింటి రాఘవేంద్ర, నాసరి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆర్‌యూలో స్ట్రాంగ్ రూమ్‌లు

- భవనాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): రానున్న సాధారణ ఎన్నికల్లో రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. అందులో భాగంగా శుక్రవారం వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలకు అనువైన భవనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి పరిశీలించారు. సాంకేతిక శాస్త్ర కళాశాల బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, అకాడమిక్ బ్లా4, ఓల్డ్ లైబ్రేరీ, నూతన లైబ్రేరీ భవల్లో వారు కలియ తిరిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు వేర్వేరుగా రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కేంద్రాలు ఏర్పాటు చేసే భవనాల్లో వెలుతురు, గాలి బాగా వచ్చేటట్లు ఉండాలని, సమీపంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వెంటనే సాంకేతిక శాస్త్ర కళాశాల బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, అకాడమిక్ బ్లా4, ఓల్డ్ లైబ్రేరీ, నూతన లైబ్రేరీ సమీపాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. నియోజకవర్గాల సిబ్బందికి గందరగోళం లేకుండా ఏ నియోజకవర్గానికి ఏ బ్లాక్, ఏ ఫ్లోర్ కేటాయించారనే సైన్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కౌంటింగ్ హాళ్లకు రెండు ద్వారాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈవీఎం మెషీన్లు కలసి పోకుండా బారికేడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ భద్రతాపరమైన అంశాలపై సమీక్షించారు. ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.



కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో పూలమాలలతో వివేకానందుడి విగ్రహం

చైతన్య మూర్తి 'వివేక' స్ఫూర్తి

స్వామి వివేకానంద.. యువతకు స్ఫూర్తి ప్రదాత. భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన మహనీయుడు. తన ప్రసంగాలతో అందరిలో చైతన్యాన్ని నింపారు. చైతన్య మూర్తి జయంతి వేడుకలను గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామిజీ జీవితంలో ప్రధాన ఘట్టాలను స్మరించుకున్నారు. ఆయన బోధనలను గుర్తు చేసుకున్నారు. స్వామి వివేకానందుడి బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

108లో ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం



శిశువును చూపుతున్న ఈఎంటీ వీరేష్

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన శారదమ్మ అనే గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవం అయినట్లు ఈఎంటీ పైయింటి వీరేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైరుప్పల గ్రామానికి చెందిన శారదమ్మకు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త స్వర్ణలత తమకు సమాచారం ఇచ్చిందన్నారు. వెంటనే పైలెట్ రామచంద్రయ్య 108 అంబులెన్స్ తీసుకుని కైరుప్పలకు వెళ్లి గర్భిణిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో చాకచక్యంగా సాధారణ కాన్పు చేశామన్నారు. క్షేమంగా ఉన్న తల్లి, బిడ్డను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. 108 అంబులెన్స్‌లో సాధారణ ప్రసూతి చేసినందుకు శారదమ్మ కుటుంబ సభ్యులు సంతోష వ్యక్తం చేస్తూ ఈఎంటీ, పైలెట్‌ను అభినందించారు.

నిరుద్యోగుల కోసం ఆన్‌లైన్ సేవా పోర్టల్

కర్నూలు(సెంట్రల్): ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సేవా పోర్టల్ సర్వీసులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య కోరారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో ఉపాధి, శిక్షణ శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ సేవా పోర్టల్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు, మోడల్ కెరీర్ సెంటర్ల అందించు సేవలను భారత ప్రభుత్వ నేషనల్‌కెరీర్ సర్వీసు(ఎన్‌సీఎస్)తో అనుసంధానించినట్లు చెప్పారు. తద్వారా ఎంప్లాయిమెంట్‌రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు తదితర సేవలను సులభరీతిలో www. employment. ap. gov. inను సందర్శించి పొందేందుకు వీలు ఉంటున్నారు. కార్యక్రమంలోజిల్లా ఉపాధి అధికారి పి.దీప్తి, సిబ్బంది నరసింహులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంజీ ఆస్టర్ నూతన కారు ఆవిష్కరణ



కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెవ్విన్ ఆటో మోటర్స్ షోరూంలో శుక్రవారం సాయంత్రం నూతన ఎంజి ఆస్టర్–2024 సరికొత్త వాహనాన్ని షోరూం అధినేత ఉదయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతితో పాటు కర్నూలు, అనంతపురం, నెల్లూరులోని తమ బ్రాంచిలో ఒకేసారి ఈ కారును మార్కెట్‌లోకి తీసుకువచ్చామన్నారు. వాహన ప్రారంభ ధర రూ.9.98లక్షలకు లభిస్తుందని, ఎడిఎస్ఎస్–ఎల్2 ఫీచర్లతో పాటు 49 సేఫ్టీ ఫీచర్స్, అతిపెద్ద సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు కారులో పొందుపరిచినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఎంజీ కొనుగోలుపై గోల్డ్‌కాయిన్‌తో పాటు రూ.2లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా, యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

● విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించాలి
● మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
● ఎస్టీయూ వజ్రోత్సవాల్లో పాల్గొన్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ర్యాలీలో పాల్గొన్న ఎస్టీయూ కార్యకర్తలు, నాయకులు





ఎస్టీయూ వజ్రోత్సవ సావనీరును ఆవిష్కరిస్తున్న మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తదితరులు, సభకు హాజరైన ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) వజ్రోత్సవాలను శుక్రవారం కర్నూలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలులోని ధర్నా చౌక్ నుంచి మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి వచ్చిన ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరిపారు. ముఖ్య అతిథులుగా మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్, గౌరవ అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ హాజరయ్యారు. సభలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగాలేకపోయినా వామపక్ష భావజాలం ఉన్న ఎస్టీయూపై అభిమానంతో వజ్రోత్సవ సభకు వచ్చానన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ఒకప్పుడు బతకలేని బడిపంతులు అనే వారని, నేడు గౌరవ ప్రదమైన వృత్తిలో కొనసాగుతున్నారన్నారు. తల్లిదండ్రుల వద్ద కంటే ఎక్కువగా ఉపాధ్యాయుల సమక్షంలోనే విద్యార్థులు ఉంటారని, గురువులకు కీలకమైన బాధ్యత ఉందన్నారు. పూర్వపు రోజుల్లో చదువే కాకుండా సమాజంలో ఎలా బతకాలో నేర్పించే వాళ్లని, పిల్లల్లో సామాజిక స్పృహ పెంచేవారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని, ఉపాధ్యాయుల ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని కోరారు.

పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. దేశంలో విద్యారంగాన్ని కాషాయీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని విమర్శించారు. సమసమాజ స్థాపనలో ఎస్టీయూ ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. ఉద్యమ నాయకుల పోరాట పటిమను ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇ.వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న వజ్రోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. వజ్రోత్సవ సావనీరును, విజయరామరాజు శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికను వేదికపై ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఇ.షణ్ముర్తి, జోసఫ్, సుధీర్ బాబు, మల్లు రఘునాథరెడ్డి, తెలంగాణ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె.జనార్దన్, అజాంపేట, డి.మౌలాలి, రామ్మోహన్‌రెడ్డి, సి.రమేష్ దేవ, ప్రసన్న రాజు, సి.నాగరాజు, ఎస్.చంద్రశేఖర్, గోపాలకృష్ణ, ఉమాదేవి, ప్రసాద్ రెడ్డి, పాలయ్య, వీరచంద్ర, నారాయణస్వామి, శ్రీధర్, గోవిందు, గోవింద నాయక్, సురేష్, ధనుంజయ, ఉస్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఎరుకుల రాముడు

పత్తికొండరూరల్ : పత్తికొండ పట్టణంలోని ఆదోని రోడ్డు సమీపంలో ఆటో డ్రైవర్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పెట్రోల్ బంకు వెనుక ఆటోకు తాడు కట్టి వేలాడుతున్న మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతుడు ఆదోని ఇంద్రానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎరుకల రాము(35)గా గుర్తించారు.వారం రోజులుగా పత్తికొండలోనే ఆటో నడుపుకుంటున్నాడు.ఆటోకు వేలాడుతున్న మృత దేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మురళీమోహన్ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య సులోచన, కుమార్తెలు అక్షయ, ఐశ్వర్య, అమ్ములు, కుమారుడు హర్ష ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం

● పి.కోటకొండలో ఘటన

దేవనకొండ: మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల బాలికపై శుక్రవారం అత్యాచారం జరిగింది. చింతొక్కు మునిరంగడు(30) అనే యువకుడు బాలికను ఇంటికి పిలుచుకుని వెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక రక్తపు మరకలతో ఇంటికెళ్లి అప్పుడే పొలం పనులు ముగించుకొని వచ్చిన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడు చింతొక్కు మునిరంగడుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆస్పరి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని చొక్కనహళ్లి గ్రామ సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.వారి వద్ద నుంచి రూ. 1,05,680 లక్షల నగదు, మూడు బైకులు,ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి వేడుకలు





దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం, స్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి జయంతి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున 5 గంటలకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి, అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం స్వామి చిత్రపటానికి పూలమాల వేసి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనడానికి జిల్లా నలుమూల నుంచేకాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడురాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

కొనసాగిన ఆచారం

స్వామి చిత్రపటాన్ని గ్రామానికి చెందిన లింగాయితీ వర్గీయులు తలపై మోసుకొని తిరుగుతారు. ఈఏడాది కూడా ఈ ఆచారం కొనసాగింది. స్వామి జయంతి వేడుకల సందర్భంగా ఫక్కీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన డప్పు వాయిద్యాలు కళాకారుల విన్యాసం అలరించింది. వేడుకల్లో ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ , పీఠాదిపతి ఖాదర్‌బాషా చిష్తీ, గుల్షన్ కమిటీ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు మున్నాపాషా, నజీర్‌అహ్మద్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మార్కెట్లోకి సరికొత్త కియా కారు

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఎంజీ బ్రదర్స్ కియా షోరూమ్‌లో శుక్రవారం సాయంత్రం కియా సోనెట్ ఫేస్ లిఫ్ట్ నూతన మోడల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రాయలసీమ హెడ్ రమణ, సుందరం ఫైనాన్స్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజీ బ్రదర్స్ కియా షోరూమ్ సేల్స్ జీఎం పి.శ్రీనివాస్, మేనేజర్ ఎ.రామాంజనేయులు మాట్లాడుతూ.. ఇప్పటికే కియా కార్లు దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొంది మార్కెట్ లీడర్‌గా నిలిచాయన్నారు. అలాగే కియా సోలెట్ ఫేస్ లిఫ్ట్ మోడల్‌లో వినియోగదారుల కోసం మరిన్ని ఆధునిక సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ సోనెట్ ఫేస్ లిఫ్ట్ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ.7,99,000 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు.



నూతన కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కియా సంస్థ ప్రతినిధులు

రామళ్లకోటలో రాతి కమలం ధ్వంసం



ధ్వంసమైన రాతి కమలం



కింద పడ్డ రాతి కమలం ముక్కలు

వెల్దుర్తి(కృష్ణగిరి): రామళ్లకోట గ్రామంలోని వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గుడి పైకప్పులోని రాతికమలం శుక్రవారం తెల్లవారుజామున ధ్వంసమై కనిపించింది. గుర్తించిన స్థానికులు ఆలయ ఈఓ రామాంజనేయులు, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డికి సమాచారం అందించారు. గర్భగుడి బయట ఆవరణలో మండపం ఉంది. నలుదిక్కులా కృష్ణదేవరాయ కాలంనాటి రాతి స్తంభాలు ఉన్నాయి. మధ్యలో రాతి పరుపు(సత్యపీఠంగా భావించే పచ్చలబండ ఉంది). మండపం పైకప్పులో రాతి కమలం రంగు రంగు రాళ్లతో నిర్మాణమై ఉంది. ఈ మండపం చుట్టూ ఇనుప కటాంజనం ఉంది. కటాంజనానికి ఎడమ ద్వారం లోపలి వైపు గడియ పెట్టకపోవడంతో దుండగులు లోపలికి వచ్చి పచ్చల బండ గల పైకప్పులోని రాతి కమలాన్ని బలమైన ఆయుధాలతో ధ్వంసం చేశారు. రాతి కమలం ముక్కలు పచ్చల బండపై పడి కనిపించాయి. రాతి కమలంలో వజ్రాలు, బంగారం, ఇతర రత్రా నిధులు దాచి ఉంటారని, వాటిని తీసుకోవాలనే దురుద్దేవంతో గుప్త నిధుల వేట్లగాళ్లు ఇలా చేసి ఉంటారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఆలయ ఈఓ రామాంజనేయులు, పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని విచారణ జరిపారు.

గుండెపోటుతో రాజవంశీయుడి మృతి

అవుకు: అవుకు సంస్థానాన్ని పరిపాలించిన రాజవంశీయుల కుటుంబానికి చెందిన రామకృష్ణమరాజు (68) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం అవుకు పట్టణంలోని రాజవంశీయుల స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అవుకు రాజ వంశీయుల కుటుంబంతో తమకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు.

మెరిసిన ముగ్గులు

ఆళ్లగడ్డ: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోదరి అవంతిక, సతీమణి సారిక పర్యవేక్షణలో నిర్వహించిన పోటీల్లో సుమారు 700 మందికి పైగా మహిళలు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఓ మహిళ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని ఆవిష్కరించి అభినందనలు అందుకుంది. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సీఎం వైఎస్ జగన్ చిత్రం ముగ్గు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం





హెచ్ఐవీ రోగులతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ సృజన , మేయర్ బీవై రామయ్య

● హెచ్ఐవీ బాధితులతో కలసి అల్పాహార విందులో పాల్గొన్న కలెక్టర్, మేయర్

కర్నూలు(సెంట్రల్): ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట హైఐవీ రోగులకు అల్పాహార విందు, పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా కలెక్టర్, మేయర్ బీవై రామయ్య హెచ్ఐవీ బాధితులతో కలసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం హెచ్ఐవీ రోగులపై వివక్ష వద్దు అనే సందేశంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బీపీ, షుగర్, క్యాన్సర్ తరహాలో హెచ్ఐవీ అనేది ఒక వ్యాధి అని, దీనికి చికిత్స ఉందన్నారు. వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పిస్తే సమాజంలో ధైర్యంగా జీవిస్తారన్నారు. జిల్లాలో ఏఆర్‌టీకేంద్రాల పనితీరు బాగుందని, వాటికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు దైనందిన జీవితంలో చక్కటి క్రమశిక్షణతో మందులు తీసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండబోవన్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో చక్కటి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అల్పాహార విందును ఏర్పాటు చేసిన సాయి ఆదరణ సేవా సంస్థ సభ్యుడు జి.నాగరాజు యాదవ్‌ను కలెక్టర్, మేయర్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయనియంత్రణ అధికారి ఎల్‌భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మీ, మైనార్టీ సంక్షేమ అధికారి సబీ హపర్వీన్, వైద్యులు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్, నేస్తం పాజిటివ్ నెట్వర్క్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం



మృతి చెందిన బోయ మల్లికార్జున

కృష్ణగిరి: కొత్తింటి కల నెరవేరక ముందే ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తెగడొడ్డి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కృష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున(46), పార్వతి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంతవరకు గుడిసే జీవనం సాగిస్తున్నా వీరు కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ ఇంటికి నీళ్ల పట్టేందుకు కొట్టంలోని కరెంట్ బోర్డులో నుంచి వైర్లు పెడుతుండగా మల్లికార్జున ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్ గురయ్యాడు. పెద్ద శబ్దం రావడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా చలనం లేని స్థితిలో పడి చేతిలో కరెంటు వైర్లు ఉండటాన్ని గమనించారు. వెంటనే ఇరుగుపొరుగు వారితో వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కొత్తింటి కల నెరవేరకుండానే ఇలా ఆకాల మరణంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో వ్యవసాయ శాఖ ఉద్యోగుల సేవా సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు కే.రవిప్రకాశ్ అధ్యక్షత జరిగిద్యీ కార్యక్రమానికి భూసంరక్షణ విభాగం డీడీఏ వెంకటేశ్వరరెడ్డి, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.జవహర్‌లాల్, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... అందరూ కలసికట్టుగా పనిచేయడం వల్లనే జిల్లా వ్యవసాయ శాఖ అందరి నుంచి ప్రశంసలు అందుకుంటోందన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది సంపూర్ణ సహకారంతో వ్యవసాయ శాఖ అన్ని కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు గిరీష్, వెంకటేశ్వర్లు, అరుణకుమారి, ఏవోలు రంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, ఉషారాణి, అనురాధరెడ్డి, పరిపాలన అధికారి పద్మావతి, జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేతలు యాసనుల్లా, నాగకిశోర్, శంకర్‌నాయక్, అరుణ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ 25 లోపు పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): రీసర్వేలో భాగంగా మూడో విడత కింద జనవరి 25వ తేదీలోపు స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మూడో విడతలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లు నాటే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. 20 ఏళ్లుగా అసైన్డ్ భూములు అనుభవిస్తున్న వారి రికార్డులను పరిశీలించి వారికి హక్కులు కల్పించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈనాం భూములకు సంబంధించిన ఈకేవైసీని త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అబాదిసర్వే కూడా వేగంగా చేపట్టాలన్నారు. భూ హక్కు పత్రాల పంపిణీని జనవరి 18లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, డీపీఓ నాగరాజునాయుడు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.